RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:100 | ఏప్రిల్ 03, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్
9701923260



**నేను బతికుండగా.. డంపింగ్ యార్డ్ పెట్టనివ్వను**

2లో


హుజురాబాద్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సమరశంఖం



# తినుబండారం!

## ఫాస్ట్ ఫుడ్ మోజులో ఆరోగ్యానికి ముప్పు

- రుచి కోసం రోగాలను కొనుక్కుంటున్న వైనం
- దీర్ఘకాలిక సమస్యలకు చిరునామాగా ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి
- యువతలో పెరుగుతున్న గుండెపోటు ముప్పు
- కృత్రిమ రంగులతో క్యాన్సర్ ముప్పులు
- చిన్న పిల్లల్లో శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం
- పోషకాలు లేని ఆహారంతో రోగనిరోధక శక్తికి దెబ్బ
- ఇంటి వంటకు ప్రాధాన్యత నివ్వాలంటున్న నిపుణులు



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

ఆధునిక కాలంలో మనిషి జీవనశైలి ఉరుకులు పరుగులమయమైంది. పని ఒత్తిడి, సమయాభావం కారణమేదైనా.. వంటింట్లో వండుకునే సంప్రదాయ ఆహారం కంటే, రోడ్డు పక్కన దొరికే ఫాస్ట్ ఫుడ్ కే యువత ఎక్కువగా మొగ్గు చూపుతోంది. నాలుకకు రుచినిచ్చే మసాలాలు, రంగురంగుల సాస్‌లు చూసి మురిసిపోతున్నాం కానీ, అవి మన శరీరంలో సైలెంట్ కిల్లర్స్‌లా మారుతున్నాయని గుర్తించలేకపోతున్నాం. పిజ్జాలు, బర్గర్లు, ఫ్రెంచ్ ఫ్రైస్, నూడుల్స్ వంటివి నేడు కేవలం చిరుతిళ్లు మాత్రమే కాదు, యువతకు నిత్య ఆహారంగా మారిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

### రంగుల వెనుక దాగున్న విషం

ఫాస్ట్ ఫుడ్ ఆకర్షణీయంగా కనిపించడానికి వాడే కృత్రిమ రంగులు, రుచి కోసం కలిపే అజినోమోటో వంటి రుచి వర్ధకాలు జీర్ణవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇవి కేవలం కడుపు నింపుతాయి తప్ప, శరీరానికి కావాల్సిన ఏ ఒక్క పోషకాన్ని అందించవు. ఫలితంగా శరీరంలో రోగనిరోధక శక్తి క్రమంగా క్షీణిస్తోంది. తరచూ ఇన్ఫెక్షన్లకు గురికావడం, అలసట, నీరసం వంటివి ఈ ఆహారపు అలవాట్ల వల్లే కలుగుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కేవలం శారీరకమే కాదు, మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. అధిక చక్కెర కలిగిన జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల ఏకాగ్రత లోపించడం,

మిగతా 2వ పేజీలో..

# భూభారతి పోర్టల్‌తో భూమి సేవలకు కొత్త దిశ

- 45 రోజుల తర్వాత జిల్లాకో మండలంలో అమలు
- ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ కేటాయింపు
- సాదాబైనామాలకు త్వరిత పరిష్కారం లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**వేద న్యూస్, రంగారెడ్డి**

రాష్ట్రంలో భూమి, సర్వే, రిజిస్ట్రేషన్ సేవలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను 45 రోజుల పాటు పరిశీలించి, అవసరమైన మార్పులు చేసి జిల్లాకో మండలంలో అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార

మిగతా 2వ పేజీలో..

# అనుమానాస్పద స్థితిలో.. స్విమ్మింగ్ పూల్‌లో..

## తల్లీ, ఇద్దరు కూతుళ్లు మృతి

### భర్తపై హత్య ఆరోపణలు.. ఐనవోలు మండలంలో విషాదం



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో తల్లి, ఇద్దరు కుమార్తెలు స్విమ్మింగ్ పూల్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం అజారుద్దీన్–ఫర్హత్ దంపతులకు అయేషా, ఉమేరా అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం రాత్రి తల్లి, ఇద్దరు పిల్లలు స్విమ్మింగ్ పూల్‌లో మృతిచెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా, ఆడపిల్లలే పుడుతున్నాయని భర్త నుంచి వేధింపులు ఎదుర్కొంటున్నట్లు మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే భర్త అజారుద్దీన్ భార్య, పిల్లలను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనులపై సీఎం రేవంత్ సమీక్ష

- ప్రాజెక్టుల పురోగతిపై పరిశీలన
- ఎఫ్‌సీడీఏ కార్యాలయ నిర్మాణాలపై సూచనలు
- స్కిల్స్ యూనివర్సిటీ పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు



**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాల నిర్మాణ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ అథారిటీ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి, భవనాల డిజైన్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆధునిక సదుపాయాలతో నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి సంబంధించిన భవన సముదాయాలను

మిగతా 2వ పేజీలో..

# నాయినిక.. నయా షహర్

**ర్యాపిడో బుక్ చేసుకుని** ఎదురుచూస్తున్న నాకు దగ్గరికొచ్చి ఓటీపీ చెప్పమ్మా అని అడిగిండు ఆటో డ్రైవరన్న.. 4031 అనిజెప్పి అటోఎక్కినం..

ఎందమ్మో డైరెక్ట్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ అని పెట్టినవ్ సార్ గిట్ల పరిచయమా..? అని అడిగిండు ఆటోడ్రైవరన్న ఎందుకు..? పరిచయం లేకపోతే సార్ కల్వరా ఏంది? అని అడిగేసరికి సుర్రుమన్నట్టుంది డ్రైవరన్నకి..

ఒక చిన్న గ్యాప్ తర్వాతా ఇంతకీ ఏం పని అని మల్లడిగిండు..

మాకు జాగున్నది ఇల్లు కట్టుకోనీకి పైసలిస్తుంద్రు కదా అడగనికి పోతున్నం అనిజెప్పిన..

నా మాట విన్న డ్రైవరన్న బల్లుమని నవ్వి.. ఎమ్మెల్యేని కలుసుడే ఎక్కువ అంటే ఇల్లువరకు పోయినవ ఎన్నికల్లో గెలవనికి వంద చెప్తరమ్మ అంత మాత్రాన అన్ని ఆయిపోతయా అని వ్యంగ్యంగా అన్నడు డ్రైవరన్న.. బాపూజీనగర్ నుండి కాజీపేట సిగ్నల్ దాటిన ఆటో ఫాతిమానగర్ బ్రిడ్జ్ కి కొద్ది దూరంలో ఉంది

ఈ డ్రైవర్ నాకున్న ఆశను సగం చంపేసిండు ఇంకా మాట్లాడితే ఆశ అడియాశ అయ్యేట్లుందని గమ్మునున్న.. ఆటో ఫాతిమా బ్రిడ్జ్ ఎక్కగానే ఈ బ్రిడ్జ్ ఇంకెప్పుడు కడతారో అని ముక్కిడ్షిన నాకు టక్కుమని సర్షినట్టు సమాధానం ఇచ్చిండు అయితనే ఉండే మాయిల్లమే కొంచబడుడెందుకు అని.. బ్రిడ్జ్ దిగేవరకు నాకు తగిలిన షాక్ పోలె.. డౌన్లో ఆటోని మెల్లగా దింపినట్టు.. అమ్మ ఇప్పుడొచ్చిన మన ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వం నుంచి అక్షరాల డెబ్బె ఆరు కోట్లు తీసుకచ్చి చేస్తుండమ్మా తొందర్లోనే అయిపోద్ది కాజీపేటకు మహర్దశే ఇగ అన్నడు నిమ్మలంగా.. వార్ని.. ఏందన్నో సిగ్నల్ దగ్గర మాట్లాడిన మాట బ్రిడ్జ్ ఎక్కేలోపు మారింది అనంగానే.. ఉన్నది ఉన్నట్టు మాట్లాడుకోవాలే గదమ్మ అనుకుంటా నా మొకాన ఒక ఉచిత సలహా పడేసిండు.. ఇగో విను.. నీకు ఇల్లు కట్టుకోనీకి పైసల్ రావాలంటే మీ గల్లీలో ఉన్న లీడర్ని పట్టుకో కార్పొరేటర్ దగ్గరికి వెళ్ళు నీ బాధ చెప్పుకో ఎమ్మెల్యే దగ్గరికి తీసుకెళ్లమను ఇంత తడుపు పైరవీ చేయించుకో ఆ తర్వాత నీకు ఇల్లొచ్చేది లేనిది తెలుస్తది...ఇదంతా విన్న నాకు ఒక్కసారి గుండె జారి చేతులోకొచ్చినంత పనైంది.. అసలే ఆసరా లేనిదాన్ని ఇదంతా నాతోని యాడైతది అనుకుంటా మదన పడ్డ.. ఫాతిమా చౌరస్తా దాటిన డ్రైవరన్న గునుగుతూ లక్షలకమానం గిట్ల రోడ్ల పాలు చెయ్యకుండా మనసోంటి పేదోనికిస్తే మంచిగుంటుండేగదా అన్నడు నాకర్థంగాక బిత్తరమొహం పెట్టి ఏదో ఆలోచిస్తూ సప్పుడు చెయ్యలే..

అదేనమ్మా... గిక్కడ సైకిల్ ట్రాక్ అని రోడ్డు మీద పోళ్లు పెట్టి రంగులేసి ప్రజా ధనం వృధా చేసింద్రు గీడ సైకిల్ తొక్కేదేవడో నేనింతవరకు సూడలే అన్నడు డ్రైవరన్న..అదికూడా నిజమేకదా అనిపించినా నేనేంస మాధానం జెప్పలే..సైకిల్ ట్రాక్ పేరుతో ఎవరు పైసల్ వృధా చేసిండ్లో తెల్వక గమ్మునున్న..

ఎన్.ఐ.టి దాటిన ఆటో ఒక్కసారి పైకి కిందికైంది ఇదేందని చూస్తే చిన్న కల్వర్టు దాటింది...అది చూసి నాకు నయీం నగర్ నాలా ముచ్చట గుర్తుకొచ్చి ఆటో అన్నను అడిగిన ఇంతకి గా.. లొల్లేంది ఎవరు కట్టిర్రు అని..

అదిమాత్రం డెబ్బె మూడు కోట్లు వెట్టి వడ్డేపల్లి చెరువు నుండి వినాయకనగర్ వయా నయీం నగర్ దార్ల నాలాలు కల్వర్టులు ఇప్పుడున్న ఎమ్మెల్యేనే కట్టిండమ్మా దాని వల్ల మొన్న వర్షాలకు తట్టుకుని ఉండగల్గిండ్లు అది కట్టకపోయుంటే హనంకొండ ఆగమైతుండే అన్నడు డ్రైవరన్న..

అన్ని మంచిపరిణామలేకదా అని మనసు నిమ్మళంజేస్కొని కూసున్న, ఆటో అదాలత్ దాటంగానే నా గుండె స్పీడ్ పెరిగింది అయ్యే ఎమ్మెల్యే సార్ ఉంటడ ఉండడా..ఉంటే కలుస్తాడా లేదా అనే ఆలోచనతో సతమతం అయితున్న అంతలోనే క్యాంప్ ఆఫీస్ రానే వచ్చింది, కొద్ది దూరం నుండే బండ్లు కన్పిస్తున్నాయ్ ఆటో డ్రైవరన్న ఎమ్మెల్యే సార్ ఉన్నరుగా వచ్చు అందుకే గిన్నిగణం బండ్లున్నయ్ అన్నడు..

నాకు సల్లజెమటాలు పుట్టినై..ఆటో దిగి పైసల్ ఫోన్ పే కొట్టిన..ఆటో డ్రైవర్ మా కాజీపేటోడే అని జెప్పిండు ఇగ నేను అన్న ఒక్క ఐదు నిమిషాలు ఆగుతవమరి మల్లొస్తా ఆడనే దింపుదువట గవ్వే పైసల్ మల్లిస్తా అన్న..

నా మొఖం చూసి పిచ్చిదాని లెక్కున్నావ్ సుషినవా లోపల ఎంతమందున్నారో ఐదు నిమిషాల్లో వస్తావామ్మా ఎమ్మెల్యేని కల్వాలంటే గంటలక మానం కుసోవాలె నీకు ఏ మధ్యాహ్నం అయితదో ఏమో అనుకుంటానే సరే మల్లా నేన్ వొయ్యేది కాజీపేటకే గాబట్టి ఒక పదినిమిషాల్ ఆగుతా ఈలోపు ఏమైనా గిరాకీ ఉంటే వెళ్లిపోతా అన్నడు డ్రైవరన్న..

సరే అనిజెప్పి కాంపౌండ్ లోపలికి అడుగువెట్టిన బరాబర్ ఐదు నిమిషాల్ దక్కువ తొమ్మిదైతాంది జనాలు ఏం దక్కువ రొండొందల మందున్నరు నాకుమాత్రం ఎక్కడలేని భయం పుట్టుకచ్చింది,మాట్లాడాల్సింది మర్చిపోతానేమోనని లోలోపల ఆగమాగమైన..


బరాబర్ తొమ్మిదైతాంది ఎమ్మెల్యే సార్ వస్తున్న అలికిడికి అందరు లేచి నిలబడ్డారు వ్యక్తిగత సిబ్బంది (గన్మెన్లు) సిద్ధంగా నిలబడ్డరు గింత మందిల నాతోని మాట్లాడతర నా పనైతదా అని అగులుబుగులైతాంది ఇగ ఒక్కటే మనసుల గట్టిగ అనుకున్న నెన్ దెచ్చిన పేపర్లు సార్ చేతుల వెట్టి అమాంతం కాళ్లమీద పడ్త ఇగ ఏమైనాగాని అనుకున్న..

సార్ లోపలికొస్తాంటే తలుపు దగ్గర భయంభయంగ నిలవడ్డ నన్నుజూసి ఎందమ్మా అని అడిగిండు నాకు నోట మాటా రాలే సార్ చేతుల పేపర్లు వెట్టిన అమాంతం కాళ్ళమీద పడవోయిన నన్ను సార్ వ్యక్తిగత సిబ్బంది ఒక్కసారిగా వెనక్కి లాగిండ్లు,సార్ కి కోపమొచ్చినట్టుంది దొరల పాలనపోయి ప్రజాప్రభుత్వం వచ్చి రెండేండ్లెతాంది ఇంకా ఈ కాళ్ళు మొక్కే సంస్కృతి మర్చిపోలేదామ్మ అన్నడు గట్టిగ..

నీ బాదేందో చెప్పాలిగాని ఎందమ్మ ఈ పిచ్చిపనులు అన్నడు సార్..జాగున్నది ఇల్లుగట్టుకుంటా సార్ అని చెప్పిన అంతే అ పేపర్లు చూసిన సార్ పక్కనున్నెనెకిచ్చిండు సర్వేకి పంపుతాం నువ్ వెళ్ళమ్మా అన్నరు.. ఇదంతా సారొచ్చిన ఐదు నుండి ఎనిమిది నిమిషాల్లో జరిగిపోయిన ముచ్చట

ఇగ బయటికొచ్చి చూస్తే వేరే సవారినెక్కిచ్చుకుని గెట్ ముందున్నడు నేనొచ్చిన ఆటో అన్న..

ఎందన్నా కాజీపేట్ వస్తాన్నావ్ మల్ల గిదేంది అన్న.. ఇపుడు నువ్ ఆటో బుక్ చెయ్యలేక దమ్మ అందుకే విల్లనెక్కిచ్చుకున్న పోత వోత















హ న్మకొండ బస్టాండ్ కాడ పడ గొట్టివోదాం అన్నడు.. నీ.. బస్టాండ్ గటుండే మనం గిటు పోవాల్నాయే. అనంగానే ఒక్క ఐదు నిమిషాల్లో తీస్కపోతా అని స్టార్ట్ చేసిండిగా ఆటో..

రోడ్డెక్కి కొంచం ముందుకు వోగానే కుడి షెయ్ మోకాన బందబస్తు బిల్డింగ్ కనిపించింది రాజుల దర్బార్ లెక్కనే ఉందికదా ఎవరిల్లు ఇది అని అడిగిన ఇదేనమ్మా కాళోజీ కళా క్షేత్రం అన్నడు, అంతలోనే ఎడమచెయ్ మోకానా ఏలు చూపెడ్తూ గివ్వే డబల్ బెడ్రూం ఇండ్లు అనుకుంటనే నాక్కూడా ఇచ్చిండమ్మా ఇప్పుడున్న ఎమ్మెల్యే నాయిని సార్ అన్నడు, అదేంది కెసిఆర్ ప్రభుత్వం కదా కట్టింది అనడిగిన అవును కరెక్టే కానీ వాళ్లుగనక ఈ తాప మల్లొస్తే మాకిచ్చుడు అటుంచితే ఎవల్కో ఒకల్కి కుదవెట్టేటోళ్లు అన్నడు.. ఇన్ని రోజులు రోడ్డుమీదున్న బతుకులకు ఆసరా అయ్యిండమ్మ నాయినన్నా..ఎండకు వానకు ఆగమైన బతుకులకు ఆసరైండు తాను గెల్వంగానే అందర్నీ ఇండ్లల్లోకి తోలిచ్చిండు..నేను ని లెక్కనే ప్రజాపాలన దరఖాస్తు పెట్టుకుంటే ఎంక్వయిరీ చేసి పిలిచి ఇచ్చిండు..ఒక్కనికి నయా పైసా ఇయ్యలే..నాయిని అన్న సుత ఎవ్వల్ పైసల్ అడిగినా నాకు చెప్పుండ్రి అని గట్టిగనే చెప్పిండు అన్నడు,

ఇవన్ని వినుకుంటా మరి నాకెందుకు చెప్పినవ్ అన్న లీడర్లకు తడపాలని అని కొంచం గరుకుగానే అడిగిన..

డ్రైవరన్న గొంతు సవరించుకుంటా అదికాదమ్మ అందరి అదృష్టం ఒకలెక్క ఉండొద్దా అన్నడు..

హన్మకొండ బస్టాండ్ సర్కిల్లో ఆటో తిరిగినట్టు నాకు గిర్రుమన్నది అదికూడా నిజమే కదా నా అదృష్టం ఎట్లుందో అనుకున్న..

సర్కిల్ తిరిగి సవారిని దించి ముందుకు కదిలింది ఆటో, నేను అడగకముందే ఎడమ పక్కనున్న కాళోజీ కళాక్షేత్రాన్ని చూపెడుతూ మస్త్ కట్టింద్రు కదా అనడిగిండు ఆటో అన్న నాకెందుకులే అన్నట్టు హా అని సమాధానం చెప్పిన ఇది కూడ పూర్తి చేసింది ఇప్పుడున్న ఎమ్మెల్యేనే అన్నడు..

అవునా..అంతా బాగానే ఉందిగాని గీ ఇండ్లు కూలగొట్టుడైతే మంచిగలేదన్న అనేసిన

హైదరాబాద్ ల కొంత డెవలప్మెంట్ కోసం వాళ్లకు ఇండ్లు ఇస్తున్నారు మల్ల..చెరువులు కబ్జా పెట్టినవాళ్ళవి కులగొడ్తాన్లు లేకపోతే వర్షాలకు మనమంతా ఆగమైతం..మనకాడా గట్లాంటి లొల్లెం లేదమ్మ అనేసరికి అవేశం పట్టలేక భద్రకాళీ గుడిదగ్గర కులగొడ్తలేరా మేమ్ వాట్సప్ల సూడలేదా అనేసిన,

గిట్లకొంత ఆగమైర్రు అనుకుంటా వాట్సాప్లో వచ్చినయన్ని నిజమనుకుంటేట్లా..! అసలు భద్రకాలిదగ్గరున్న అ ఇండ్లను కూలగొట్టమని అక్కడున్నోళ్లను ఖాళీ చేయించమని చెప్పిందే పోయిన ఎమ్మెల్యేనమ్మా (గత ఎమ్మెల్యే) చేసిన తప్పును కప్పి పుచ్చుకోవడానికి వాట్సాప్లో మెసేజ్లు, బతుకులు ఆగమైనట్లు మ్యూజిక్కులు పెట్టి వీడియోల్ జేసుడు వాళ్ళతోని ఏం బాగుపడ్డదో తెల్వద్ గానీ ఆగమైనై మాత్రం వంద చెప్పొచ్చు,

ఇంకా ఇపుడున్న ఎమ్మెల్యే నాయినన్నా నయ్యం వాళ్లకు ఇండ్లు ఇస్తాండు...(ప్రస్తుతం కొందరికి ఇచ్చారు)

అవునా... మరి గి ముచ్చట ఎవ్వరు చెప్తలేరేంది.? నిజం నిద్ర లేచేలోపు అబద్ధం అన్ని గడపలు తట్టి వస్తదని ఉత్తగానే అన్లేగదా...!

అదికూడా నిజమే.. అనుకుంటా నా గమ్యం చేరుకున్న నేను ఆటో దిగుతూ డ్రైవర్ అన్నను అవ్ అన్న మన సీఎం రేవంత్ రెడ్డి అడోళ్ళకు ఫ్రీ బస్సు పెట్టి మీకు నష్టం చేసిండుగదా అనేసరికి చిన్నగా నా వైపు జాలిగా చూసి వాట్సాప్ వీడియోలు చూసుడు బంద్ చేయమ్మ అనుకుంటా ఇపుడు నువ్ ర్యాపిడో బుక్ చేస్తే ఆటో వచ్చిందా బస్ వచ్చిందా..? బస్టాండ్ నుండి బస్టాండుకి బస్సులే పోతయ్ అటోల్ బోవ్..బస్టాండ్ నుండి ఇంటికి బస్సుల్ రావ్ ఆటో ఎక్కాల్సిందే..ఇగ మాకేడైంది నష్టం అన్నుకుంటా బుర్రుమని ఏళ్లిపోయిండన్న..

వార్నీ ఇంత చిన్న లాజిక్ ఎట్లా మిస్సైన అనిపించింది..

వారం తర్వాత వందరోజుల్లో పూర్తి చెయ్యాలని చేతికొచ్చిందో పత్రం..ఆనందానికి అవధులు లేవు ఒకటెనుకొకటి బిల్లులు పడ్డాయ్ మొత్తానికి ఇల్లు పూర్తి చేసిన, నా జీవితంలో సొంతిల్లు కడ్తనని అనుకోలే..కనీసం నా పేరు అడగలే ఏ పార్టీకి ఓటేశినవ్ అనడగలే..ఎక్కడుంటవన్నది అడగలే ఒకే ఒక్కసారి ఆ కాంపౌండ్ లోకి అడుగు పెట్టిన అంతే.... ఆడ తన మన బేధం లేదనిపిచ్చింది ఒక్క నయా పైసా నన్నెవరు అడగలె నేనెవ్వరికియ్యలే..

నిజంగా ఇది ప్రజల ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అనిపించింది, నిజానికి గత ప్రభుత్వం పింఛిన్లిచ్చింది పథకాల పేరుతో పైసలిచ్చిందిగాని ఎవ్వరికీ నిలువ నీడనియ్యలే..నేను అడుగు పెట్టిన ప్రజా భవన్లో నాకు న్యాయం జరిగిందనే ఆనందం అంతా ఇంతా కాదు ఈ ఆనందంతో మా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారిని కలిసి కృతజ్ఞతలు చెబ్దామని వచ్చిన అంటూ తన గృహప్రవేశానికి ఆహ్వానించడానికొచ్చిన ఆ మహిళా పేరు (మూలుకుట్ల మమత)నాకు చెప్పడం జరిగింది.

సార్ని కలిసి ఏం చెప్తవమ్మా అని అడిగిన నేను,

గింతగనం మాకోసం తిప్పలవడుతున్న సార్కి కనీసం కృతజ్ఞలైనా చెప్తా..నీడనిచ్చిండు మాకు తోడైండు సొంతింటి కల నెరవేర్చిండు ఎవ్వరు మాకోసం రాలే సొంత లాభం చూసుకునే ఈ రోజుల్లో నాలాంటి ఎంతో మందికోసం నిలబడి నికార్సైన లీడర్ అనిపించుకున్నడు మా నియోజకవర్గం ప్రజలు అదృష్టవంతులు మా ఎమ్మెల్యే నాయిని రాజేందరన్నకు దండం పెట్టాలే..

నాయినన్న వచ్చినంక నియోజకవర్గ రూపు రేఖలు మారిపోయినయ్ ఇది నాయినికా నయా షహర్ అన్నట్లు తీర్చిదిద్దుతుండు ఒక ఊరిని దత్తత తీసుకున్న వాళ్లు కూడా ఇంతగనం చెయ్యరు.. అంటూ ఇంతలోనే వచ్చిన సార్కి తన గృహ ప్రవేశానికి రమ్మని ఆహ్వానించింది మమత. సామాన్యులకు అందుతున్న లబ్ది పట్ల వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పట్ల ఇమేలాగా అ ఆటో డ్రైవర్ లెక్క ప్రతిఒక్కరికి అవగాహన కలిగిన రోజు పుకార్లు పుట్టించి పబ్బం గడుపుకునే సోకాల్డ్ నేతలకు భవిష్యత్ శూన్యమే అనిపించింది. నా జీవితంలో సొంతిల్లు కడ్తనని అనుకోలే..కనీసం నా పేరు అడగలే ఏ పార్టీకి ఓటేశినవ్ అనడగలే..ఎక్కడుంటవన్నది అడగలే ఒకే ఒక్కసారి ఆ కాంపౌండ్ లోకి అడుగు పెట్టిన అంతే

ఆడ తన మన బేధం లేదనిపిచ్చింది ఒక్క నయా పైసా నన్నెవరు అడగలె నేనెవ్వరికియ్యలే.. నిజంగా ఇది ప్రజల ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అనిపించింది, నిజానికి గత ప్రభుత్వం పింఛిన్లిచ్చింది పథకాల పేరుతో పైసలిచ్చిందిగాని ఎవ్వరికీ నిలువ నీడనియ్యలే..నేను అడుగు పెట్టిన ప్రజా భవన్లో నాకు న్యాయం జరిగిందనే ఆనందం అంతా ఇంతా కాదు ఈ ఆనందంతో మా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారిని కలిసి కృతజ్ఞతలు చెబ్దామని వచ్చిన అంటూ తన గృహప్రవేశానికి ఆహ్వానించడానికొచ్చిన ఆ మహిళా పేరు (మూలుకుట్ల మమత)నాకు చెప్పడం జరిగింది.

సార్ని కలిసి ఏం చెప్తవమ్మా అని అడిగిన నేను,

గింతగనం మాకోసం తిప్పలవడుతున్న సార్కి కనీసం కృతజ్ఞలైనా చెప్తా..నీడనిచ్చిండు మాకు తోడైండు సొంతింటి కల నెరవేర్చిండు ఎవ్వరు మాకోసం రాలే సొంత లాభం చూసుకునే ఈ రోజుల్లో నాలాంటి ఎంతో మందికోసం నిలబడి నికార్సైన లీడర్ అనిపించుకున్నడు మా నియోజకవర్గం ప్రజలు అదృష్టవంతులు మా ఎమ్మెల్యే నాయిని రాజేందరన్నకు దండం పెట్టాలే.. నాయినన్న వచ్చినంక నియోజకవర్గ రూపు రేఖలు మారిపోయినయ్ ఇది నాయినికా నయా షహర్ అన్నట్లు తీర్చిదిద్దుతుండు ఒక ఊరిని దత్తత తీసుకున్న వాళ్ళుకూడా ఇంతగనం చెయ్యరు... అంటూ ఇంతలోనే వచ్చిన సార్కి తన గృహ ప్రవేశానికి రమ్మని ఆహ్వానించింది మమత. సామాన్యులకు అందుతున్న లబ్ధి పట్ల వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పట్ల ఇమేలాగా అ ఆటో డ్రైవర్ లెక్క ప్రతిఒక్కరికి అవగాహన కలిగిన రోజు....

పుకార్లు పుట్టించి పబ్బం గడుపుకునే సోకాల్డ్ నేతలకు భవిష్యత్ శూన్యమే అనిపించింది.

మహమ్మద్ ఫయాజ్
9701045096

---

# తినుబండారం

**మొదటి పేజీ తరువాయి**

ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు విద్యార్థుల చదువుపై, ఉద్యోగుల పనితీరుపై పడుతున్నాయి.

**చిన్న వయసులోనే పెద్ద జబ్బులు**

ఫాస్ట్ ఫుడ్లో ఉండే అధిక కొవ్వు, మితిమీరిన ఉప్పు, చక్కెరలు శరీర మెటబాలిజాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. దీనివల్ల గతంలో 50 ఏళ్లు దాటిన వారికి వచ్చే మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు నేడు 20 ఏళ్ల యువతలోనే కనిపిస్తున్నాయి. శరీరంలో పేరుకుపోతున్న చెడు కొలెస్ట్రాల్ కారణంగా గుండె సంబంధిత వ్యాధులు చిన్న వయసులోనే ప్రాణాలు తీస్తున్నాయి. అధిక బరువు అనేది నేడు ఒక మహమ్మారిలా మారి, అనేక ఇతర అనారోగ్య సమస్యలకు పునాది వేస్తోంది.

**పిల్లల భవిష్యత్తుపై ప్రభావం**

నేటి తరం పిల్లలకు అమ్మ వంట కంటే ప్యాక్డ్ ఫుడ్ పైనే మక్కువ ఎక్కువవుతోంది. తల్లిదండ్రులు కూడా సమయం లేకనో, పిల్లల మారాం తట్టుకోలేకనో ఫాస్ట్ ఫుడ్ను అలవాటు చేస్తున్నారు. చిన్నప్పటి నుంచే ఇలాంటి అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల వారి ఎదుగుదల కుంటుపడటమే కాకుండా, భవిష్యత్తులో దీర్ఘకాలిక రోగులుగా మారే ప్రమాదం ఉంది. ఇంట్లో వండిన తాజా కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాల ప్రాముఖ్యతను పిల్లలకు వివరించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంది.

**మేలుకుందాం..**
**ఆరోగ్యాన్ని కాపాడుకుందాం..**

ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు ఊరికే అనలేదు. ఫాస్ట్ ఫుడ్ను పూర్తిగా మానేయడం కష్టమైనా, దాని వినియోగాన్ని క్రమంగా తగ్గించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తాజా ఆకుకూరలు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. శీతల పానీయాలకు బదులు పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తీసుకోవడం ఉత్తమం. తీసుకున్న ఆహారం సరిగ్గా జీర్ణమవ్వడానికి కనీసం అరగంట పాటు వ్యాయామం లేదా నడక తప్పనిసరి. రుచి కోసం రోగాలను కొనుక్కోవద్దు. మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది. ఇప్పటికైనా మేల్కొని సరైన ఆహారపు అలవాట్లు అలవర్చుకుంటేనే రేపటి తరం ఆరోగ్యంగా ఉంటుంది.

# ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనులపై సీఎం సమీక్ష

**మొదటి పేజీ తరువాయి**

కూడా పరిశీలించారు. పనులు నిర్దిష్ట గడువులో పూర్తయ్యేలా వేగవంతం చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అత్యుత్తమ సదుపాయాలు కల్పించేలా నిర్మాణాలు ఉండాలని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, స్కిల్స్ యూనివర్సిటీ వైస్ చాన్సెలర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టుల అమలు వేగవంతం చేయాలని, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ ద్వారా తెలంగాణను అభివృద్ధిలో ముందంజలో నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

# భూభారతి పోర్టల్తో భూమి సేవలకు కొత్త దిశ

**మొదటి పేజీ తరువాయి**

పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మిఠాయిపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన ఈ పోర్టల్ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. ఆమనగల్తో పాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, సంగారెడ్డి జిల్లా వట్పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ఈ పోర్టల్ను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ద్వారా ప్రజలు ఎటువంటి కార్యాలయాలకు వెళ్లకుండా తమ స్మార్ట్ ఫోన్ ద్వారానే అన్ని సేవలను పొందవచ్చని మంత్రి తెలిపారు. భూమికి సంబంధించిన రికార్డులు, నమోదు, సర్వే వివరాలు ఒకే వేదికలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అవినీతి తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. గతంలో అమలైన విధానాల కారణంగా 9.52 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. సాగులో ఉన్న భూములపై హక్కులను ధృవీకరించి, అర్హులకే పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాలు మున్సిపాలిటీలుగా మారిన ప్రాంతాల్లో కూడా ఈ విధానం వర్తించేలా మార్పులు చేస్తున్నామని చెప్పారు. భూమి వివరాలకు ఆధార్ తరహాలో ప్రతి సర్వే నంబర్కు భూధార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించడం, వేలాది సర్వేయర్లకు శిక్షణ ఇవ్వడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు.

# నేను బతికుండగా.. డంపింగ్ యార్డ్ పెట్టనివ్వను

**వేద న్యూస్, హుజురాబాద్**

హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని సిర్సపల్లి సమీపంలో ప్రభుత్వం ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ అంశంపై స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బతికుండగా హుజురాబాద్ గడ్డపై డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయనిచ్చే ప్రసక్తి లేదని ఆయన గురువారం స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మరియు నాయకులతో కలిసి డంపింగ్ యార్డ్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన ఆయన, ఈ సందర్భంగా ప్రభుత్వ ఉత్తర్వులను బహిరంగంగా చదివి వినిపించారు. స్వయంగా ముఖ్యమంత్రే ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారని, ఇది ప్రజల జీవన్మరణ సమస్య అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణం దెబ్బతిని, ప్రజలు ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టమయ్యే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేద న్యూస్

శుక్రవారం ఏప్రిల్ 03, 2026

# కనగర్తిలో గ్రామసభ

## – సమస్యల పరిష్కారానికి కృషి – సర్పంచ్ సంపత్



**వేద న్యూస్ , ఇల్లందకుంట:**

గ్రామ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కనగర్తి గ్రామ సర్పంచ్ రామంచ సంపత్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. గురువారం సర్పంచ్ రామంచ సంపత్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ గ్రామపంచాయతీ ఆఫీసులో ఏర్పాటు చేసారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా.. ప్రస్తుతం అమలులో ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని ప్రతిష్టాత్మక పథకాలపై చర్చ నిర్వహించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ. 500 గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, గృహజ్యోతి సన్నరకం వరి బోనస్, చేయూత, పెన్షన్స్, కళ్యాణ లక్ష్మి,ఇందిర మహిళా శక్తి స్వయం సహాక సంఘాలకు బ్యాంకు లింకేజీ , వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు మొదలైన వాటికి సంబంధించిన నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు గ్రామంలో నెలకొన్న సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ఆయా సమస్యలపై పాలకవర్గం సానుకూలంగా స్పందించింది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వట్టపెల్లి శరత్ చంద్ర, వార్డు సభ్యులు , గ్రామ కార్యదర్శి క్రాంతి కుమార్, రెవెన్యూ విభాగ జీపీఓ శ్రీనివాస్, కరెంట్ విభాగ లైన్మెన్ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ అరుణ్ కుమార్, హెల్త్ విభాగం ఆశ తిరుమల,అంగన్ వాడీ టీచర్స్ సరిత, వనమాల, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కోమలత,ఎడ్యుకేషన్ విభాగం కృష్ణమూర్తి, శ్రీనివాస్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సన్నిధిలో ఘనంగా హనుమాన్ చిన్న జయంతి



**వేద న్యూస్, వేములవాడ :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి, శ్రీ భీమేశ్వర స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అలాగే వీరాంజనేయ స్వామివారికి మంత్రోచ్చారణల మధ్య సుప్రభాత ధారాభిషేకం, మహాపూజలు ఘనంగా జరిపారు. దేవస్థానం పరిధిలోని అనుబంధ ఆలయాలలో పరివార దేవతలకు చందనాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను మామిడాకులు, పూలతో అందంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో రమాదేవి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి దర్శనం చేసుకున్నారు.

# విప్‌ను కలిసిన వేములవాడ బార్ కార్యవర్గం

## – అభివృద్ధికి రూ.5 లక్షలు ప్రకటించిన ఆది శ్రీనివాస్




**వేద న్యూస్, వేములవాడ :**

వేములవాడ న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గం గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. అధ్యక్షుడు పిట్టల మనోహర్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు పూలమొక్క అందించి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ బార్ అసోసియేషన్ అభివృద్ధికి తక్షణమే రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సంబంధిత ప్రొసీడింగ్ కాపీని వారం రోజుల్లో అందజేస్తానని హామీ ఇచ్చారు. దీనిపై కార్యవర్గ సభ్యులు ప్రభుత్వ విప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# తాళం వేసిన ఎంఆర్ఓ కార్యాలయం

## అర్జీదారుల ఇబ్బందులు.. అధికారులపై ఆగ్రహం




**వేద న్యూస్, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రం లోని ఎంఆర్ఓ కార్యాలయం గురువారం ఉదయం 11 గంటల వరకు తాళం వేసి ఉండటం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన అర్జీదారులు తాళం వేసి ఉండటంతో నిరాశకు గురయ్యారు. అక్కడ ఉన్న కొందరు ప్రజల సమాచారం మేరకు ప్రజాపాలన కార్యక్రమం, గ్రామసభల కారణంగా కార్యాలయం తెరవలేదని తెలిపారు. ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ కార్యాలయం మూసివేయడం సరికాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సేవలు అవసరమైన సమయంలో కార్యాలయం మూసివేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

## – ఇందిరమ్మ ఇల్లు పథకంతో గృహప్రవేశం



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కింద నిర్మించిన ఇంటికి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సాగరం నాగరాజు–ఉమ దంపతులు ఈ పథకం ద్వారా తమ సొంతింటి కలను సాకారం చేసుకున్నారు. కార్యక్రమాన్ని సర్పంచ్ ఏనుగుల కనకయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేసిన సహకారాన్ని కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జోగు శంకర్, గోల్కొండ సూరి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్ కుమార్, ఏనుగుల అనిల్ కుమార్, గ్రామ కార్యదర్శి మిరుదొడ్డి శ్రీనివాస్, కారోబార్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలో పాల్గొన్న విప్, కలెక్టర్




**వేద న్యూస్, వేములవాడ రూరల్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో నిర్వహించిన 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' గ్రామసభలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం సేవాభావంతో పనిచేస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడంపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యంతో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' విజయవంతం చేయాలి

## – ప్రత్యేక అధికారి, ఎంపీడీవో జయశీల




**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో ప్రజల భాగస్వామ్యంతో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్యేక అధికారి, ఎంపీడీవో జయశీల అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో సర్పంచ్ నల్లమోహన్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలను ప్రజలకు తెలియజేసి, అభివృద్ధి పనులపై చర్చించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జయశీల మాట్లాడుతూ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంగా ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను అమలు చేస్తోందని తెలిపారు. పారిశుధ్యం, వైద్య సేవలు, రోడ్డు భద్రత, వ్యవసాయం, మహిళా సంక్షేమం వంటి రంగాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు గ్రామస్తులు సహకరించాలని సూచించారు. అలాగే గ్రామపంచాయతీలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రజనీ దేవి, ఉపసర్పంచ్ చందన జలంధర్, కార్యదర్శి అనిల్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన గ్రామసభలు


## – ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలం మధురానగర్ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక గ్రామసభలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడం గ్రామసభల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందని అన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో ఇప్పటికే 3500 ఇళ్లు మంజూరయ్యాయని, మరిన్ని త్వరలో అందిస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తామని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేముల భాస్కర్, ఎంపీడీవో రాము, ఉప సర్పంచ్ తూం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య



**వేద న్యూస్, గంగాధర :**

గంగాధర మండలం మధురానగర్‌లో మహిళ ఉరివేసుకుని మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మృతురాలిని దూస లత (45)గా గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, లత గత ఏడాది కాలంగా మానసిక అస్వస్థతతో బాధపడుతూ చికిత్స పొందుతోంది. బుధవారం వరకు సాధారణంగానే ఉండగా, గురువారం ఉదయం గది తలుపు తెరవకపోవడంతో అనుమానం కలిగింది. భర్త శంకరయ్య తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా, కిటికీకి ఉన్న వైర్‌తో ఉరివేసుకుని ఉన్నట్లు గుర్తించారు. భర్త శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

వేద న్యూస్

శుక్రవారం ఏప్రిల్ 03, 2026

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సరే..

- బండి సంజయ్ ఫోటో ఎందుకు లేదు..?
- మున్సిపల్ అధికారులపై బీజేపీ నేత అసంతృప్తి

**వేద న్యూస్, చొప్పదండి :**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 14వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై మున్సిపల్ అధికారుల తీరును బీజేపీ నాయకుడు తాడూరి శివకృష్ణ తప్పుపట్టారు. ఫ్లెక్సీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఫోటోలు మాత్రమే ఉంచి, స్థానిక ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫోటోను ఉంచకపోవడం సరికాదని అన్నారు. చొప్పదండి మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కీలకంగా నిధులు అందిస్తోందని, పట్టణ అభివృద్ధి కోసం వందల కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మున్సిపల్‌లో బీజేపీకి ముగ్గురు కౌన్సిలర్లు ఉన్నారని, ఇకనైనా కేంద్ర హోంశాఖ సహాయ



మంత్రి ఫోటోను కార్యక్రమాల్లో తప్పనిసరిగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జరుగుతున్న కార్యక్రమాల్లో తగిన గౌరవం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా కోరారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- కొండైల్‌పల్లిలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**వేద న్యూస్, నల్లబెల్లి :**

గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి తెలిపారు. గురువారం నల్లబెల్లి మండలం కొండైల్‌పల్లి గ్రామంలో సర్పంచ్ స్వప్న-నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఉపాధి హామీ (ఈజీఎస్) నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు, పక్కా రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభ




**వేద న్యూస్, కంటాత్మకూర్:**

హనుమకొండ జిల్లా నడికూడ మండలం కంటాత్మకూర్ గ్రామంలోని రైతు వేదికలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ కోంగంటి తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి మండల ఎమ్మార్వో రాణి, స్పెషల్ ఆఫీసర్ నవీన్ కుమార్, ఈజీఎస్ఏపీఓ విద్యావతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి లావణ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎమ్మార్వో మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కారాలు చేపడుతున్నామని తెలిపారు. తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుధ్యం, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, మహాలక్ష్మి, ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలపై దరఖాస్తులు స్వీకరించారు. గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం కీలకమని, అన్ని రంగాల్లో అభివృద్ధి చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అరవింద పబ్లిక్ స్కూల్లో ఉచిత దంత వైద్య శిబిరం




**వేద న్యూస్, ఖిలావరంగల్ :**

వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగసాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూలులో గురువారం విద్యార్థులకు దంత వైద్య నిపుణులు డాక్టర్ వి సంధ్య ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మంది విద్యార్థుల దంతాలను పరిశీలించారు. వీరిలో సుమారు 20 మంది విద్యార్థుల దంత సమస్యలను గుర్తించి తదుపరి చికిత్స కోసం తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరం ద్వారా అనుభవజ్ఞులైన దంత వైద్యులచే విద్యార్థులకు దంత ఆరోగ్యం పై అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. దీని వల్ల పిల్లలు చిన్నప్పటి నుంచే తమ దంత ఆరోగ్యాన్ని కాపాడుకోవడం నేర్చుకుంటారని తెలిపారు. డాక్టర్ వి సంధ్య మాట్లాడుతూ పిల్లలలో సాధారణంగా చిగుళ్ళ నుంచి రక్తం కారడం, చిగుళ్ల వాపు, పంటి నొప్పి, ఇన్ఫెక్షన్ల వంటివి వస్తుంటాయని వాటిని ప్రారంభంలోనే గుర్తించి అవసరమైన చికిత్సల ద్వారా నయం చేసుకోవాలని తెలిపారు. అలాగే పిల్లలు సరైన విధంగా పళ్లు తోముకోవాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, రోజూ రెండు సార్లు బ్రష్ చేయడం వంటి మంచి అలవాట్ల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మాజిపల్లిలో గ్రామసభ

- ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి
- సర్పంచ్ ఎం రేణుక కుమార్ స్వామి

**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా లక్ష్మాజిపల్లి గ్రామంలో సర్పంచ్ ఎం రేణుక కుమార్ స్వామి అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామసభ స్పెషలాఫీసర్ ఏ.రవి ఏపీవో హాజరయ్యారు. గ్రామ ఉపసర్పంచ్ కోడూరి చంద్రయ్య, వార్డ్ మెంబర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి కుమార్ శివరంజని, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ సర్పంచ్ బండి మల్లయ్య, మాజి సర్పంచ్ గుర్రాల రమాదేవి ప్రతాపరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కే తిరుపతి రెడ్డి, అధికారులు మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# 14వ వార్డులో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక సభ



**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి పట్టణంలోని 14వ వార్డులో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వైశ్య భవన్‌లో వార్డ్ సభ నిర్వహించారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో గత రెండున్నర సంవత్సరాల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వార్డ్ సమస్యలపై ప్రజలతో చర్చించి, ఇందిరమ్మ ఇళ్లు మరియు నూతన పెన్షన్ పథకాలకు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, కమిషనర్ టీ. మనోహర్ పాల్గొన్నారు. వార్డ్ కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోడిగే సురేష్, బొడిగె తిరుపతి, వార్డ్ అధికారి నూనె పవన్, అంగన్వాడీ టీచర్ మల్లీశ్వరి, ఆర్‌ఓ లావణ్య, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- ఐదుగురు అరెస్ట్.. నగదు, మొబైల్‌లు స్వాధీనం

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. తాహరాపూర్ గ్రామ శివారులో గోకుంట చెరువు కట్ట వద్ద కొంత మంది వ్యక్తులు డబ్బుల తో పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. అక్కడ ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,500 నగదు, మూడు మొబైల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. కంబాల శివ, తక్కళ్ల సాయికుమార్, బండారి రమేష్, బెడితల రాజ్‌కుమార్, కుక్కల రాజు తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు సతీష్, శ్రీనివాస్, ఖలీల్, క్రాంతి, నరేష్ పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో వివక్ష అంటూ నిరసన

- 'సమాన నిధులు-సమాన అభివృద్ధి' డిమాండ్

**వేద న్యూస్, నల్లబెల్లి:**



ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామాల అభివృద్ధిలో వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ కన్నారావుపేట సర్పంచ్ మూర్తి గ్రామసభలో నిరసన వ్యక్తం చేశారు. అధికార పార్టీ గ్రామాలకు మాత్రమే నిధులు కేటాయించడం సరికాదని, అన్ని గ్రామాలకు సమానంగా నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామసభలో బ్యానర్‌లు, పోస్టర్లతో చేసిన ఈ నిరసన చర్చనీయాంశంగా మారింది. 'సమాన నిధులు-సమాన అభివృద్ధి' అనే నినాదాలతో సర్పంచ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధికి రాజకీయాలు అడ్డంకి కావద్దని, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ నిరసనకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. అధికారాలు సానుకూలంగా స్పందించి గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మూర్తి కోరారు.

# జన సంక్షేమమే ధ్యేయంగా కృషి

- గ్రామ సభలో టేకుర్తి సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్

**వేద న్యూస్ ,ఇల్లందకుంట:**



99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా టేకుర్తి గ్రామంలో గ్రామ సభ సర్పంచ్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎం పి డబ్ల్యూ దివ్య హాజరయ్యారు. సర్పంచ్ తోడేటి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న ప్రధాన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సంక్షేమ మే ధ్యేయంగా పనిచేస్తామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామ సభలో గ్రామ సమస్యలను గుర్తించి తీర్మానాలు చేశారు. సభలో సర్పంచ్ తోడేటి శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ కే ప్రవీణ్, వార్డ్ మెంబెర్స్, ఎంపీడబ్ల్యూ దివ్య, గ్రామ కార్యదర్శి సురేష్, సబ్ ఇంజనీర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, స్కూల్ హెచ్ ఎం, అంగన్వాడీ టీచర్ రేణుక, ఫీల్డ్ అసిస్టెంట్ సువర్ణ, డీలర్ కృష్ణప్రియ, సి ఏ సుజాత, అశవర్కర్ స్రవంతి, వీఆర్‌ఏ గ్రామ ప్రజలు తదితరులు దాదాపు 300 మంది గ్రామ సభలో పాల్గొన్నారు.

వేద న్యూస్



## ఘనంగా బొమ్మల కట్టయ్య జయంతి వేడుకలు



**వేద న్యూస్, కరీమాబాద్ :**

ప్రముఖ సామాజిక కార్యకర్త, నిరుపేదల పెన్నిధి దళిత రత్నా, ప్రజారత్నా, బొమ్మల కట్టయ్య 82వ జయంతి వేడుకలు గురువారం కరీమాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీకే ఫౌండేషన్, కరీమాబాద్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బొమ్మల అంబేద్కర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కట్టయ్య విగ్రహానికి పూలమాలలు అలంకరించి బుధవందనం గావించి యువజన సంఘం యువకులకు తెల్ల చొక్కాలు,విద్యార్థులకు బట్టల పంపిణీ కార్యక్రమం చేశారు. కార్యక్రమనంతరం వక్తలు మాట్లాడుతూ.. కట్టయ్య తన జీవితాంతం అణగారిన వర్గాల కోసం, ముఖ్యంగా విద్య మరియు సామాజిక చైతన్యం కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. 1968లోనే పాఠశాలలను స్థాపించి విద్యాసేవలు అందించడమే కాకుండా, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేసుకున్నారు. కట్టయ్య స్ఫూర్తితో సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, మాజీ కార్పొరేటర్స్ నాగపురి కల్పన సంజయ్, మేడిది రజిత మధుసూదన్, కత్తరశాల వేణుగోపాల్, ఎస్సీ స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ కొంగర జగన్మోహన్, డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్ కుమార్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మిద్ద పాక ఎల్లయ్య, అంబేద్కర్ భవన్ కమిటీ అధ్యక్షురాలు తరాల రాజమణి, నీల మల్లేశం, కడారి కుమార్, భారతీయ బౌద్ధ మహాసభ నాయకులు కిషన్, కొమురయ్య, పలువురు నాయకులు, బజ్జీరి వాసు, బైరి నాగరాజు, గడ్డం యుగేందర్, బండి రాజమణి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జక్కుల రాజు, తరాల రవితేజ, ఎలుక నిశాంత్, నీలం రాజు, నీలం స్వామి, ఎలుక సిద్ధార్థ, ఓ నరేష్,ఒంటెల సురేష్ మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభల నిర్వహణ



**- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

ప్రజల సమస్యలను గ్రామ స్థాయిలోనే గుర్తించి పరిష్కరించేందుకు గ్రామ సభలు కీలక వేదికలుగా నిలుస్తున్నాయని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్ దేశాయిపేటలో నిర్వహించిన గ్రామ సభలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ కావేటి కవిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి తగిన ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించడం ద్వారా సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని మంత్రి గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'ఇందిరమ్మ రాజ్యం' వస్తుందని నమ్మి ప్రజలు తమను గెలిపించారని, ఆ విశ్వాసానికి అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. నిరుపేదలు, మహిళలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు ఆర్థిక సహాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం వంటి పథకాలు ప్రజలకు అందుతున్నాయని, ఈ పథకాల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న సేవలను జిల్లా కలెక్టర్ పర్యవేక్షిస్తూ, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలను కూడా తరచుగా తనిఖీ చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే అవకాశముందని, దీంతో మహిళలకు మరిన్ని రాజకీయ అవకాశాలు లభిస్తాయని అన్నారు. పట్టణాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, తడి-పొడి చెత్తను వేరు చేయాలని, శానిటేషన్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని మంత్రి సూచించారు. జీడబ్ల్యూఎంసీ స్వచ్ఛత యాప్‌పై ప్రజల్లో అవగాహన పెంచి వినియోగాన్ని ప్రోత్సహించాలని అన్నారు. వీధి వ్యాపారులు పరిశుభ్రత పాటించాల్సిన అవసరం ఉందని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తీసుకున్న పలు కీలక నిర్ణయాలను మంత్రి వివరించారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అంగన్వాడీ నుండి కళాశాల స్థాయి వరకు విస్తరించడం, ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1.15 కోట్ల మందికి రక్షణ కల్పించడం, కుటుంబ పెద్ద మరణిస్తే రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం వంటి నిర్ణయాలు ప్రజలకు భరోసానిస్తాయని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వరకు విస్తరించడం ద్వారా విద్యార్థుల పోషకాహారం మరియు హాజరు శాతం పెరుగుతాయని అన్నారు. దివ్యాంగ విద్యార్థులకు మోటారు సైకిళ్లు, ట్రైసైకిళ్లు అందజేయడం, పంట మార్పిడి విధానాలను ప్రోత్సహించడం, పట్టణాల్లో మిద్దె తోటలను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలను కూడా ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, డిఆర్ఓ విజయలక్ష్మి, బల్దియా అదనపు కమిషనర్ చంద్రశేఖర్, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, సిఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, సమ్మయ్య (అడ్మిన్), ఎంహెచ్ఓ డా. రాజేష్, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాంకీ విల్లా ఓనర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

రాంకీ విల్లా ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షులుగా విష్ణుకాబ్రా, ఉపాధ్యక్షులు కనుకుంట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బేతి అశోక్ బాబు, జాయింట్ సెక్రెటరీ బలబద్ర రాము, కోశాధికారి హనుమంతరావు, ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం విల్లా ప్రాంగణంలోని దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యులు తమ బాధ్యతలను స్వీకరించారు. ప్రధాన కార్యదర్శి బేతి అశోక్ బాబు మాట్లాడుతూ, విల్లా వాసుల సమస్యల పరిష్కారం, సాధారణ వసతుల మెరుగుదల, పారదర్శక వ్యవస్థ, మరియు సౌహార్ద వాతావరణం కోసం కృషి చేస్తామని వెల్లడించారు.రాంకీ విల్లా ఓనర్స్ అసోసియేషన్ రాజ్యాంగం, నిబంధనలు, విధివిధానాలను పాటిస్తామన్నారు. సంఘ అభివృద్ధి, శ్రేయస్సు, సాఫల్యం కోసం పారదర్శకతతో, నిజాయితీతో పని చేస్తామని సభ్యుల హక్కులు, అభిరుచులను గౌరవిస్తూ, అందరి అభిప్రాయాలను సమానంగా పరిగణిస్తామన్నారు. ఎవరి మీదా పక్షపాతం, అన్యాయం లేకుండా సేవ చేయడానికి కట్టుబడి ఉంటాము సంఘ ఆస్తి, నిధులు, రికార్డులను జాగ్రత్తగా, బాధ్యతతో నిర్వహిస్తాము సంఘ ఏకతా సమన్వయాన్ని కాపాడుతూ, శాంతిశ్రేయస్సును పెంపొందిస్తాము మా పదవిని వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించమని అప్పగించిన బాధ్యతలను శ్రద్ధగా, సమర్థవంతంగా నిర్వర్తిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంపత్ రావు,పెంచలయ్య ,అజయ్ రఘువీర్ ,పూర్ణ చందర్ ,సదానందం ,శ్రీనివాస్ ,సోమ వేణు ,బేతిరాజు విల్లా వాసులు, పెద్దలు పాల్గొని కమిటీ సభ్యులను ఆశీర్వదించారు. ఎన్నికైన కార్యవర్గానికి సహకరించిన విల్లా యజమానులకు కృతజ్ఞతలు తెలిపారు.



## గడ్డివానిపల్లిలో గ్రామసభ

**- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**
**- గ్రామ సభలో సర్పంచ్ గడ్డి శ్రీనివాస్**

**వేద న్యూస్ , ఇల్లందకుంట:**



ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభు త్వం పని చేస్తున్నదని గడ్డి వానిపల్లి సర్పంచ్ గడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. గడ్డివానీపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ గడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి ప్రజల కోసం పనిచేస్తున్నదని చెప్పారు. రైతుబంధు నిధులు, రైతు బీమా అదేవిధంగా పెన్షన్ ఇందిరమ్మ ఇల్లు గృహ జ్యోతి రైతు రుణమాఫీ కొత్త రేషన్ కార్డ్ ఉచిత బస్సు గ్యాస్ సబ్సిడీ ఈ విధంగా పథకాలన్నింటి గురించి వివరించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్యులకు బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తున్నదని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు .. నిజమైన అర్హత కలిగిన వారికి వస్తున్నాయని ప్రజా ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామాన్ని అభివృద్ధి బాటలో ముందు వరుసలో ఉంచాలని గ్రామ సర్పంచ్ ను కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మండలాధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి ప్రాణం.. 'వార్డు సభ'

**- కుటుంబ సభలా మారడం ఆందోళనకరం?**
**- ప్రజాస్వామ్యాన్ని ఎవరూ ప్రైవేట్ ఆస్తి చేసుకోలేరు!**
**- 9వ వార్డు బీజేపీ అధ్యక్షులు పీజేఆర్**



**వేద న్యూస్, జమ్మికుంట:**

వార్డు సభ అనేది ప్రజాస్వామ్యానికి ప్రాణం అని, ఇది ప్రజల గొంతుక, వారి హక్కుల వేదిక, వారి సమస్యలకు న్యాయం జరిగే స్థలం అని జమ్మికుంట మున్సిపల్ 9వ వార్డు బీజేపీ అధ్యక్షులు పొనగంటి రవికుమార్ (పీజేఆర్) పేర్కొన్నారు. అలాంటి పవిత్ర వేదికను కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత ఆస్తిలా మార్చుకుంటూ, ప్రజాస్వామ్యాన్ని నేరుగా అవమానిస్తున్న పరిస్థితి ఏర్పడిందనీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు పిజేఆర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వార్డు సభను 9వ వార్డ్ కౌన్సిలర్ పొనగంటి రాము ఇంటి వద్ద నిర్వహించడం అంటే, ప్రజల హక్కులను తలకిందులు చేయడమే కాదు.. అది ప్రజాస్వామ్యాన్ని ఇంటి గోడల మధ్య బంధించడమేనని ఆరోపించారు. ఇది సభ కాదుడ స్పష్టంగా ఒక "కుటుంబ మీటింగ్" మాత్రమేనని, ప్రజల సమస్యలు చర్చించాల్సిన వేదికను ఒకరి ఇంటికి పరిమితం చేయడం వెనుక ఉద్దేశ్యం ఏమిటి? పారదర్శకతకు భయమా? ప్రజల ప్రశ్నలకు జవాబు చెప్పలేని పరిస్థితా? లేకపోతే తమ అనుచరులతో మాత్రమే సభ నడిపించాలనే దురుద్దేశమా? ఇలాంటి ప్రైవేట్ ప్రదేశాల్లో జరిగే సభలు సహజంగానే అనేక మందిని దూరం చేస్తాయనీ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఇలాంటి ప్రదేశాలకు వెళ్లడంలో అసౌకర్యం, భయం అనుభవిస్తారనీ, అప్పుడు ఆ సభలో వినిపించేది ప్రజల గొంతుక కాదు .. కొంతమంది వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల ప్రతిధ్వనులు మాత్రమేనని, ఇది కేవలం ఒక తప్పు కాదు.. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై స్పష్టమైన దాడి.. ప్రజలకు సంబంధించిన నిర్ణయాలు, చర్చలు, అభిప్రాయాలు అన్ని ప్రజల మధ్యే జరగాలనీ అనుకోవడం అన్నారు. అందరికీ కనిపించే పబ్లిక్ ప్రదేశాల్లోనే.. పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు వంటి అందరికీ అందుబాటులో ఉన్న ప్రదేశాల్లోనే వార్డు సభలు నిర్వహించడం అనేది ఒక నియమం మాత్రమే కాదు.. అది ప్రజాస్వామ్యానికి కనీస గౌరవం అని వెల్లడించారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఇలాంటి దుర్వినియోగాలను అడ్డుకోవాలనీ, ప్రజాప్రతినిధులు కూడా తమ బాధ్యతను గుర్తించి, ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేయకుండా వ్యవహరించాలనీ పీజేఆర్ సూచించారు.

## 40వ డివిజన్లో వార్డు సభ



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ - మురళీధర్ ఆదేశానుసారం ఉర్సు చమన్ సిఆర్ సి భవన్ "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" (99 రోజుల కార్యాచరణ) కార్యక్రమలో భాగంగా గురువారం వరంగల్ మహా నగర పాలక సంస్థ 40వ డివిజన్లో వార్డు సభ నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీర్జా అత్తర్ హాజరయ్యారు. అదే విధంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు కార్పొరేటర్ మరుపల్లి రవి, గడ్డం స్రవంతి యుగంధర్ గౌడ్, మోయిన్, పాల కుమారస్వామి, మున్సిపల్ అధికారులు అర్ఐ ప్రవీణ్, జిపిఓ గణేష్,ఏడి బిల్ కలెక్టర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలు ఏర్పాటు

**వేద న్యూస్, రుద్రూర్ :**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రుద్రూర్ మండల కేంద్రంతో పాటు అక్బర్ నగర్, చిక్కడపల్లి, సులేమాన్ నగర్ రాయకూర్, రాయకూర్ క్యాంపు, బొప్పాపూర్ తదితర గ్రామాలలో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. రుద్రూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభలో గ్రామస్తులు గ్రామంలోని సమస్యలను సభా దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం ఎస్సై సాయన్న మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి అరవింద్, తహసీల్దార్ తారాబాయి, పంచాయతీ సెక్రటరీ ప్రేమ్ దాస్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ గ్రామానికి చెందిన కాదారి చిన్న సాయిలు గత ఎనిమిది నెలల క్రితం అంబం రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వారి కుటుంబ పరిస్థితి బాగోలేనందున విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఎస్సై సాయన్న బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

## వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

**వేద న్యూస్, పోతంగల్ :**



పోతంగల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, స్థానిక మండల నాయకులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన సభలో సర్పంచ్ ఉదారత

**- సొంత నిధులతో హెల్త్ సెంటర్‌కు వైద్య పరికరాల వితరణ**

**వేద న్యూస్, కారేపల్లి:**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా గాదేపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం భారీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ సమస్యలపై చర్చించడమే కాకుండా, గ్రామ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ తన సేవా గుణాన్ని చాటుకున్నారు. గ్రామసభలో పాల్గొన్న మాణిక్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఏఎన్ఎంలు.. ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం బీపీ మరియు షుగర్ పరీక్షా యంత్రాల అవసరం ఉందని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తక్షణమే స్పందించిన గాదేపాడు సర్పంచ్ మరియు సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్, తన సొంత నిధులతో ఆ రెండు యంత్రాలను కొనుగోలు చేసి అక్కడికక్కడే ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. సర్పంచ్ చేసిన ఈ ఆదర్శవంతమైన పనిని అధికారులు, గ్రామ ప్రజలు వేనోళ్ల కొనియాడారు. పాలనను ప్రజల వద్దకే చేరువ చేస్తూ.. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, సింగరేణి మండల ఐకెపి సీసీ జయపాల్ పాల్గొని మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వాంకుడోత్ కుమార్ గ్రామ అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. ఈ సభలో ఉప సర్పంచ్ నన్నేబోయిన ఉపేందర్, ఎంపియుపిఎస్ స్కూల్ హెచ్ఎం మల్లేశ్వరరావు, గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు. వీరితో పాటు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, విద్యా, వైద్య, రెవెన్యూ, ఫారెస్ట్, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు, ఐకెపి వీఓఏలు, డ్వాక్రా మహిళలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**- సంచార పాలకులు విజయలక్ష్మి**

**వేద న్యూస్, శాయంపేట :**



తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు నేతన్నల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. శాయంపేట గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఈ విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సంచార పాలకులు విజయలక్ష్మి మాట్లాడుతూ.. చేనేత మరియు జౌళి శాఖ ద్వారా అమలు అవుతున్న సంక్షేమ పథకాలపై నేతన్నలకు అవగాహన కల్పించారు. చేనేత రుణ మాఫీ, పొదుపు పథకం, నేతన్న భద్రత, వేతన ప్రోత్సాహక పథకాల ద్వారా లబ్ధి పొందే విధంగా సూచించారు. గ్రామానికి చెందిన 97 మంది చేనేత కార్మికులకు మొత్తం రూ.3,25,500 ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ పథకాల ద్వారా కార్మికుల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పణి చంద్ర, సర్పంచ్ చింతల ఉమారవిపాల్, రమేష్, చేనేత కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా-పాలన, గ్రామసభలు

**- భజ్యతండా సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు**



**వేద న్యూస్, కారేపల్లి:**

ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండలంలోని భజ్యతండా గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ వద్ద జరిగిన సభలో సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామ, వార్డు సభలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కింద గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సీసీ రోడ్లు, చేపట్టినట్లు తెలిపారు. ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం వంటి పథకాలతో పాటు 6 గ్యారంటీలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు, ఇందిరా మహిళ శక్తి పథకం, రైతులకు బోనస్, విద్యార్థులకు అల్పాహారం, దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు వంటి పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు. గ్రామసభల్లో లబ్ధిదారుల వివరాలను చదివి వినిపిస్తూ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో,ఆశ వర్క ర్ లావుడ్యా సరస్వతి,ఉప సర్పంచ్ మోహన్ రావు ,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయలు వాంకుడోత్ మంగీలాల్, సక్కు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు

**- సంక్షేమ ఫలాలతో ప్రజలకు నూతన ఆశలు : భాగ్యనగర్ తండా గ్రామసభలో సర్పంచ్ హీరాలాల్**

**వేద న్యూస్,కారేపల్లి:**



తెలంగాణ రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి సాధనతో పాటు ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ ఫలాలు అందించి ప్రజలను సుభిక్షంగా నిలబెట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భాగ్యనగర్ తండా సర్పంచ్ హీరాలాల్ పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల ప్రత్యేక ప్రణాళికలు గ్రామాల అభివృద్ధికి కొత్త ఊపును తీసుకువస్తున్నాయని ఆయన తెలిపారు. భాగ్యనగర్ తండాలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతూ, ఈ ప్రత్యేక కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో తక్షణ అభివృద్ధి పనులు వేగవంతమవుతున్నాయని అన్నారు. కొత్తగా ఏర్పడిన పాలకవర్గాలకు ఈ ప్రణాళికలు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని వివరించారు. గ్రామస్థుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలను గుర్తించడం, వాటికి తగిన పరిష్కార మార్గాలను కనుగొనడం ఈ కార్యక్రమం ద్వారా సాధ్యమవుతోందని చెప్పారు. ఈ గ్రామసభలో ఎంపీడీవో, ఐకేపీ ఏపీఎం, పంచాయతీ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు, పాలకవర్గ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సర్పంచ్

**వేద న్యూస్, కారేపల్లి :**



మండల పరిధిలోని గాదెపాడు గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో మంజూరైన రెండు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సైడ్ కాలువ (డ్రైనేజీ) పనులకు గాదెపాడు సర్పంచ్ & సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్యా రంజిత్ కుమార్,గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని బొడ్రాయి సెంటర్ నుండి నన్నేబోయిన రాంపండు ఇంటి వరకు ఉన్న మురుగు నీటి సమస్యను పరిష్కరించేందుకు ఈ సైడ్ కాలువ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో గ్రామంలో మరిన్ని నిధులు వెచ్చించి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ పారిశుద్ధ్యం మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నన్నేబోయిన ఉపేందర్, పాలక వర్గ సభ్యులు,గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

**వేద న్యూస్, రుద్రూర్ :**



హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకొని రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం సాయంత్రం హనుమాన్ శోభాయాత్రను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా హనుమాన్ విగ్రహాన్ని ఊరేగించారు. డీజే చప్పులతో, హనుమాన్ స్వాముల నృత్యాలతో శోభయాత్ర కొనసాగింది. శోభయాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ శోభయాత్రలో గ్రామ సర్పంచ్ ఇందూరి సునీత చంద్రశేఖర్, ఆలయ కమిటీ నిర్వాహకులు, హనుమాన్ స్వాములు, గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పాయిగూడెం గ్రామాభివృద్ధి నా బాధ్యత

**- ఎమ్మెల్యే రాందాస్ నాయక్**

**వేద న్యూస్,కారేపల్లి:**



మండలంలోని అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి. గ్రామంలో ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ దండు ప్రవీణ్ ఆధ్వర్యంలో గురువారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో వర్షాకాలంలో తలెత్తుతున్న డ్రైనేజీ సమస్యలు, అధ్వాన్నంగా ఉన్న అంతర్గత రహదారుల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామవ్యాప్తంగా సైడ్ డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలి. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా సీసీ రోడ్లను మంజూరు చేయాలి. గ్రామస్థుల విన్నపాన్ని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. "అప్పాయిగూడెం గ్రామ అభివృద్ధి నా బాధ్యత. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరలోనే నిధులు మంజూరు చేసి, అవసరమైన చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందన పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనుచరులు ఎస్.ఎన్ నాయక్, గ్రామ శాఖ కార్యదర్శి పాల్తియా శివాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం ఏప్రిల్ 03, 2026

# లేడీ డాన్ బారినుంచి రక్షించాలి

**– సీపీఐ నేతకు రైతు కుటుంబం వినతి**

**వేద న్యూస్, నల్లబెల్లి :**



అప్పుల పేరుతో మోసపూరితంగా వేధింపులకు గురిచేస్తున్న మహిళ నుంచి రక్షించాలంటూ నల్లబెల్లి మండలం లెంకపల్లి గ్రామానికి చెందిన యువ రైతు కొనకటికి రమేష్ కుటుంబం సీపీఐ నేత చింతకింది కుమారస్వామిని ఆశ్రయించి వినతిపత్రం సమర్పించింది. రమేష్ వివరాల ప్రకారం, 2024 జూలైలో మహబూబాబాద్‌లో ఆయుర్వేద మెడికల్ స్టోర్ ప్రారంభించేందుకు రుణం కోసం ప్రయత్నించినప్పటికీ బ్యాంకు రుణం రాకపోవడంతో పరిచయస్తుల ద్వారా గుజ్జా సుజాతను సంప్రదించినట్లు తెలిపారు. ఆమె సూచనతో 10 లక్షల రూపాయల రుణం పొందేందుకు తన పేరున్న రెండు ఎకరాల 10 గుంటల భూమిని గౌరవెల్లి విఘ్నేశ్వరరావు పేరుపై మార్టిగేజ్ చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో కమిషన్, ఫీజుల పేరుతో రెండు లక్షలు తీసుకుని కేవలం 8 లక్షలు మాత్రమే తమ ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. నెలకు రూ.30 వేల వడ్డీ చెల్లించినప్పటికీ, మళ్లీ మరిన్ని డబ్బులు తీసుకోవాలని ఒత్తిడి తెచ్చి సెప్టెంబర్‌లో భూమిని ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారని వాపోయారు. అనంతరం 20 లక్షల రుణంపై అధిక వడ్డీ విధిస్తూ నెలకు రూ.1.20 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేసి, ఇప్పటివరకు సుమారు రూ.9 లక్షలు చెల్లించినప్పటికీ ఇంకా రూ.68 లక్షలు బాకీగా చూపిస్తూ భూమిని విక్రయిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల సర్పంచ్ ఇంటి వద్ద జరిగిన వివాదంలో తన భార్య పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిపారు. సంబంధిత మహిళ కార్లలో వ్యక్తులను తీసుకువచ్చి బెదిరింపులకు దిగుతోందని, తమ కుటుంబానికి ప్రాణాపాయం ఉందని పేర్కొన్నారు. ఈ విషయంపై స్పందించిన సిపిఐ నేత చింతకింది కుమారస్వామి, చట్టప్రకారం రుణం వసూలు చేయవచ్చుగానీ మోసపూరిత చర్యలు అనుమతించబోవమని తెలిపారు. బాధిత కుటుంబం తరపున పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తూ, ఎలాంటి అన్యాయం జరిగినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్థానిక పోలీసు అధికారులతో కూడా మాట్లాడతానని తెలిపారు.

# ప్రజా సంక్షేమం - అభివృద్ధే ధ్యేయం

**– ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**వేద న్యూస్, శాయంపేట:**




శాయంపేట మండలం పెద్దకొడెపాక గ్రామంలో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం నిర్వహించగా, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల అమలును వివరించారు. గృహలక్ష్మి పథకం, మహాలక్ష్మి ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత విద్యుత్, విద్యారంగ అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మండల రైతుల కోసం మక్కల కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ప్రజల సమస్యలను పరిష్కరించి సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రవి, ఆర్డీవో నారాయణ, ఏడీఏ జగదీష్ రెడ్డి, ఎంపీడీవో ఫణి చంద్ర, ఎంపీఓ రంజిత్ కుమార్, మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కలుషిత నీటి సరఫరా.. ప్రజల్లో ఆందోళన

**– శుద్ధి చేసిన తాగునీరు అందించాలని డిమాండ్**




**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి పట్టణంలోని పలు కాలనీలలో మున్సిపాలిటీ సరఫరా చేసిన తాగునీరు కలుషితంగా రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఇంటింటికీ వచ్చిన కుళాయి నీరు పసుపు రంగులో ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ నీటిని వినియోగిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా నీటి నాణ్యత తగ్గుతున్నప్పటికీ, గురువారం పరిస్థితి మరింత తీవ్రమైందని పేర్కొన్నారు. వేసవికాలంలో తాగునీటి అవసరం పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి సరఫరా ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. వెంటనే అధికారులు స్పందించి నీటి నాణ్యతను పరీక్షించి, శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇండ్లలో అక్రమాలు?

- 12వ వార్డు సభ్యుడు రామంచ చింటూ ఆవేదన
- సిరిసేడు గ్రామసభలో ఉద్రిక్తత?
- అర్హులకు ఇళ్లు మంజూరు చేయలేదు?
- గ్రామసభలో లబ్ధిదారుల ఆగ్రహం

**వేద న్యూస్, ఇల్లందకుంట:**



ఇల్లందకుంట మండల పరిధిలోని సిరిసేడు గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభ ఉద్రిక్తంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో నిరుపేదలైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని భావించినప్పటికీ, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరుగుతోందని 12వ వార్డు సభ్యుడు రామంచ చింటూ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభలో పలువురు లబ్ధిదారులు కూడా ఇదే అంశంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, అర్హులైన వారికి ఇళ్లు కేటాయించడం లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా రామంచ చింటూ మాట్లాడుతూ.. సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత కార్యదర్శిగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ నిజమైన అర్హులకు అన్యాయం చేశారని విమర్శించారు.సిరిసేడు గ్రామంలో మొదటి విడతలో ప్రతి ఎన్నికల బూత్‌కు 9 చొప్పున మొత్తం 3 బూత్‌లకు 27 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, అందులో సగానికి పైగా అనర్హులకు కేటాయించారని ఆరోపించారు. ఈ విషయంపై అర్హులైన కొంతమంది కలిసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన రాలేదని తెలిపారు. సమస్యను దృష్టికి తీసుకురావడానికి సిరిసేడు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేసినప్పటికీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లభించలేదని వాపోయారు. కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, లబ్ధిదారుల జాబితాను పునఃసమీక్షించి నిజమైన అర్హులకు ఇళ్లు కేటాయించాలని సూచించినప్పటికీ, ఆదేశాలను పట్టించుకోకుండా సంబంధం లేని కొత్త వ్యక్తులకు ఇళ్లు మంజూరు చేశారని మండిప డ్డారు. గ్రామసభకు హాజరైన మరికొంతమంది లబ్ధిదారులు కూడా తమకు అర్హత ఉన్నప్పటికీ ఇళ్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నూతన సర్పంచ్ పాలకమండలి జోక్యం చేసుకుని రెండో విడతలో నిజమైన అర్హులను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు

**వేద న్యూస్, బోయినిపల్లి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాపన్న గౌడ్ బహుజన విప్లవ వీరుడిగా నిలిచారని, నిజాం రాజుల నిరంకుశ పాలనకు ఎదురొడ్డి గోల్కొండ కోటను జయించిన మహానాయకుడని పేర్కొన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని బహుజనులు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మండల కోశాధికారి మెరుపుల గంగాధర్ గౌడ్, ఉపాధ్యక్షులు కొండ కనకయ్య గౌడ్, మంద ఆంజనేయులు గౌడ్, పులి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కళలకు జీవం పోస్తున్న కళాకారులు

**– కళాకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి**

**వేద న్యూస్, చందుర్తి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద బుధవారం రాత్రి సాధు సజ్జన భజన మండలి ఆధ్వర్యంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. స్వర్గీయ తిప్పని వెంకట్రాజయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న జానపద కళలను వెలుగులోకి తీసుకువస్తున్న కళాకారులను అభినందించారు. ఇటువంటి నాటక ప్రదర్శనలు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదం చేస్తాయని అన్నారు. నాటకంలో స్థానిక కళాకారులు పాత్రధారులుగా నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కళాకారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తులకు తాగునీరు పంపిణీ చేసిన 'గివ్ మీ లైట్' ఎన్జీఓ

**వేద న్యూస్, మెట్‌పల్లి :**




బండలింగాపూర్ గ్రామంలోని గండి హనుమాన్ ఆలయం వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులకు 'గివ్ మీ లైట్' ఎన్జీఓ సభ్యులు త్రాగునీరు అందజేశారు. గత 10 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్జీఓ సభ్యులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఎండకాలంలో తాగునీరు అందించడం తమ సేవా కార్యక్రమాల్లో భాగమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సునీల్ రాజా, సురేష్, నరేష్, సుభాష్, సనత్, దీప, బలరాం, రాజేందర్, ప్రణీత్, ఆర్యన్, విహాన్ బాలకిషన్, సందీప్, భవేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ గోశాలలో ఈవో ఆకస్మిక తనిఖీ

**– పశుగ్రాసం నాణ్యతపై ప్రత్యేక దృష్టి**

**వేద న్యూస్, వేములవాడ:**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధమైన తిప్పాపురం గోశాలను ఆలయ ఈవో రమాదేవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోశాల నిర్వహణ, కోడెల సంరక్షణపై ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోశాలకు వచ్చిన పశుగ్రాసం బ్యాగులను స్వయంగా తెరిపించి, ఆహార నాణ్యతను పరీక్షించి కోడెలకు తినిపించారు. ఫీడ్ నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండకూడదని సిబ్బందికి సూచించారు. అలాగే గోశాల పరిసరాల పరిశుభ్రత, షెడ్ల పరిస్థితిని పరిశీలించి, కోడెల పేడతో జరుగుతున్న బయోగ్యాస్ ఉత్పత్తి ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. సంరక్షణలో నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోశాల పర్యవేక్షకులు విజయ్, జూనియర్ అసిస్టెంట్ రవి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

**వేద న్యూస్, కరీంనగర్ :**



కరీంనగర్ జిల్లా అలుగునూర్ బ్రిడ్జ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర యువత అధ్యక్షుడు గోడిశల రమేష్ గౌడ్ మాట్లాడుతూ, పాపన్న ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. జనగాం జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాపన్న చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని కోరారు. అనంతరం కలెక్టర్ ఆడిటోరియంలో ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, బీసీ వెల్ఫేర్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం ఏప్రిల్ 03, 2026

# మున్సిపల్ బడ్జెట్ 34 కోట్ల 70 లక్షలు

**వేద న్యూస్,జమ్మికుంట :**

జమ్మికుంట మున్సిపల్ బడ్జెట్ సమావేశం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టిన రూ. 34 కోట్ల 70 లక్షల బడ్జెట్ ను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందులో 2026- 27 ఆర్థిక సంవత్సరం క్యాపిటల్ గ్రాండ్ 24 కోట్ల 69 లక్షలు , 2026-27 ఆర్థిక సంవత్సరం జనరల్ ఫండ్ ఆదాయము 9 కోట్ల 64 లక్షలు, మున్సిపల్ కార్మికుల, ఉద్యోగుల జీతాలు ఆదాయ, వ్యయాలు వంటి పలు అంశాలను పొందు పరచగా పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ, మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఏఈ వికాస్, టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీధర్, రాజ్ కుమార్, జూనియర్ అకౌంట్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్ లతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు పలువురు పాల్గొన్నారు.



- పాలకవర్గం ఆమోదం

# నల్ల పోచమ్మ ఆలయంలో దొంగతనం

## - విగ్రహం ధ్వంసం.. నగలు అపహరణ

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**



ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలోని నల్ల పోచమ్మ ఆలయంలో దొంగతనం, విగ్రహ ధ్వంసం ఘటన వెలుగులోకి వచ్చింది. మార్చి 29న పూజలు ముగించుకుని ఆలయానికి తాళం వేసి వెళ్లగా, ఏప్రిల్ 2న ఉదయం పూజల కోసం వెళ్లిన అర్చకులు గుడి తలుపులు పగలగొట్టిన దృశ్యాన్ని గమనించారు. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి చొరబడి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసి కింద పడేసి, బంగారం, వెండి ఆభరణాలు అపహరించినట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాండ్ర పెద్దు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై జి. నవీన్ తెలిపారు.

# ఘనంగా శకటోత్సవం..





## - జాతరకు ముస్తాబైన రాములవారి గుట్ట

**వేద న్యూస్, గంగాధర :**

గంగాధర మండలం గట్టు బుత్కూర్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి గుట్ట వద్ద గురువారం శకటోత్సవ (బండ్లు తిరుగుడు) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ వాహనాలను తిప్పి స్వామివారిని దర్శించుకున్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. శుక్రవారం జరగనున్న రథోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఆలయం, గుట్టను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి వేళల్లో గుట్ట అందంగా వెలుగులు విరజిమ్ముతూ భక్తులను ఆకర్షిస్తోంది. భక్తుల కోసం తాగునీరు, మజ్జిగ పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# ఘనంగా వెంకటేశ్వర బ్రహ్మోత్సవాలు

## - పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**వేద న్యూస్, చొప్పదండి :**



చొప్పదండి మండలం కాట్నపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ గన్ను శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ పెరుమాండ్ల మానస గంగయ్య, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, నాయకులు గాజంగి రాములు, చుప్ప శ్రీనివాస్, కట్టెకోల లక్ష్మణ్, కట్టెకోల శ్రీనివాస్, పెరుక శ్రీనివాస్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

# బాల్య మిత్రుల సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**వేద న్యూస్, ఇల్లందకుంట:**

సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలుస్తున్న 1983-84 బ్యాచ్ మిత్రులు జమ్మికుంట పరిసర ప్రాంతమైన ఇల్లంతకుంటలో ఉన్న సీతారామచంద్ర స్వామి ఆలయంలో బాల్య మిత్రుల సేవా సమితి ఆధ్వర్యంలో వేసవి దాహాన్ని తీర్చే చలివేంద్రాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ క్రాంతికుమార్ హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించి, సమితి సభ్యుల సేవా తత్వాన్ని అభినందించారు. వేసవి కాలంలో భక్తులు, ప్రయాణికులు, గ్రామ ప్రజలు ఎదుర్కొనే నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సమాజానికి అవసరమైన సమయంలో ముందుకు వచ్చి సేవ చేయడం గొప్ప విషయం అని కొనియాడారు. బాల్య మిత్రుల సేవా సమితి సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.., 1983-84 విద్యాసంవత్సరానికి చెందిన జమ్మికుంట జెడ్పి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులు అందరూ కలసి 26-12-2016న ఈ సమితిని స్థాపించారు. అప్పటి నుండి మిత్రబంధాన్ని సేవా బంధంగా మార్చుకుని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం చేపడుతున్నారు. ప్రత్యేకంగా కరోనా మహమ్మారి సమయంలో ఈ సమితి సభ్యులు చూపిన సేవా స్ఫూర్తి విశేషంగా నిలిచింది. 41 రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం అల్పాహారం పంపిణీ చేయడం, మాస్కులు, సానిటైజర్లు ఉచితంగా అందించడం ద్వారా అనేక మందికి అండగా నిలిచారు. ఆ కష్టకాలంలో వారి సేవలు ప్రజల మన్ననలు పొందాయి. అదే సేవా స్ఫూర్తితో గత తొమ్మిది



సంవత్సరాలుగా నిరంతరం ఇల్లంతకుంటలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ, దాహార్తిని తీర్చడమే కాకుండా సమాజానికి తమ బాధ్యతను చాటుతున్నారు. ప్రతి సంవత్సరం మిత్రుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మునుముందు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి, సమాజానికి మరింతగా సేవ చేయాలని సమితి సభ్యులు సంకల్పించారు. ఈ కార్యక్రమంలో రేపెల్లి సంపత్ కుమార్, గుండా సురేందర్, ముకిరాల సంపత్ రావు, హనుమాన్ల కొమురయ్య, మట్టేపల్లి ప్రకాష్, మట్ట వాసుదేవ రెడ్డి, కళ్యాణం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి

## - లంచాలు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి
## - సర్పంచ్ పబ్బు సతీష్

**వేద న్యూస్, కమలాపూర్**



హనుమకొండ జిల్లా కమలాపూర్ లో గురువారం నిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ పబ్బు సతీష్ ప్రభుత్వ పథకాల అమలుపై కీలక వ్యాఖ్యలు చేశారు. నిజమైన అర్హులకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ముఠాల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యవర్తుల పైరవీకి తావు లేకుండా పథకాలు పారదర్శకంగా అమలు కావాలని అన్నారు. గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయడం లేదని, 15వ ఆర్థిక సంఘం నిధులపైనే ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. చేనేత కార్మికుల ఉపాధిని కాపాడేందుకు టెస్కో ద్వారా నేరుగా వస్త్రాల కొనుగోలు చేయాలని, ఓపెన్ టెండర్ల వల్ల వారికి నష్టం కలగకూడదని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆసరా, వికలాంగుల పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# సిరిసేడు గ్రామంలో ప్రత్యేక గ్రామసభ ప్రభుత్వ పథకాలపై అవగాహన

- రానున్న రోజుల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- 100 రోజుల పాలనలో సైడ్ డ్రైనేజీ, బస్టాండ్, మరుగుదొడ్ల నిర్మాణం
- సర్పంచ్ రేనుకుంట్ల శ్యామల కుమార్

**వేద న్యూస్ , ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండలం సిరిసేడు లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా తీసుకున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ రేణికుంట్ల శ్యామల - కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ అనే గీతం ఆలపించి తదుపరి ముఖ్యమంత్రి సందేశం గ్రామస్తులకు చూపించారు.. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని ఆయా శాఖల పనుల వివరాలు తెలిపారు. అనంతరం సర్పంచ్ రేణికుంట్ల శ్యామల కుమార్ మాట్లాడుతూ...ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్రూం.గృహజ్యోతి, చేయుత పెన్షన్స్, మహాలక్ష్మీ పథకములో భాగంగా గ్యాస్ సిలెండర్ సబ్సిడి, తడి - పొడి చెత్త వేరు చేయడం, పరిసరాల పరి శుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. వేసవి నేపథ్యంలో మంచినీటిని వృదా చేయకుండా చూడడం ఇతర అంశాలపై సూచించారు.

**100 రోజుల పాలనలో సైడ్ డ్రైనేజీ, బస్టాండ్, వాష్ రూమ్స్ నిర్మాణం**

సర్పంచిగా బాధ్యతలు చేపట్టిన 100 రోజులలో గ్రామ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నామని శ్యామల తెలిపారు. ఎస్సీ కాలనీలో సైడ్ డ్రైనేజీ గత 25 సంవత్సరాలుగా పరిష్కారం కానటువంటి డ్రైనేజీని పూర్తిచేశామన్నారు.. ఎస్సీ కాలనీలో ఉన్న ప్రైమరీ స్కూల్ కి ప్రహరీ గోడ నిర్మించామని తెలిపారు. ప్రజల సౌకర్యం కోసం ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా సిరిసేడు కి చెందిన గన్ను సంపత్ సహకారంతో బస్టాండ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.. ఆదివారం వారసంత కు వచ్చేటువంటి మహిళలను దృష్టిలో పెట్టుకొని బస్టాండ్ లో మరుగుదొడ్ల నిర్మాణం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామంలో




అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రతి నిరుపేదకు అర్హునికి అందే విధంగా పారదర్శకంగా పరిపాలన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు రెడ్డి సారంగం, అమ్మ గోని రమేష్, వరలక్ష్మి, కాశమల శ్రీలేఖ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073